# శ్రీ సుబ్రహ్మణ్య వ్రతం

సాక్షాత్తూ శ్రీ స్వామి వారిచే అనుగ్రహింపబడిన అద్భుత వ్రతకల్పము



తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి



ఓం తత్పురుషాయ విద్మహే
మహాసేనాయ ధీమహి
తన్నో స్కందః ప్రచోదయాత్

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు

# శ్రీ సుబ్రహ్మణ్య వ్రతం

సాక్షాత్తూ శ్రీ స్వామి వారిచే అనుగ్రహింపబడిన అద్భుత వ్రతకల్పము



తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

**శ్రీ డిజైన్స్**

**www.lordofsevenhills.com**
**Phone : 040 - 23833752**

**హైదరాబాదు**
**2014**

## శ్రీ సుబ్రహ్మణ్య వ్రతం

సాక్షాత్తూ శ్రీ స్వామి వారిచే అనుగ్రహింపబడిన అద్భుత వ్రతకల్పము

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి



First Edition : 2014

వెల : అమూల్యం

కాపీలకు
**"Viswapathi"**
**T.V.R.K. MURTHY, M.Tech**
Flat No. 202, Plot No. 32,
Srikar's Ravi Residency,
Beside Nalanda High School,
Near Motinagar 'X' Roads,
HYDERABAD - 500 018, India.
Ph : 040 - 23833752.
Cell : 98494 43752
Website : www.lordofsevenhills.com
Email: viswapathi@yahoo.com
shridesigns@gmail.com

Designed & Printed at :
**SRI VASAVI PRINTERS,**
1A, 1st Floor, Ameepet,
Hyderabad. 9989277178.

# నివేదన

సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం షణ్ముఖనాథం సుబ్రహ్మణ్యం
సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం శంకరపుత్రం సుబ్రహ్మణ్యం

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుడు జ్ఞాన ప్రదాత. తనను నమ్మి కొలచినవారిని ఈ స్వామి నిత్యం కంటికి రెప్పలా కాపాడుతుంటాడు. ఆ స్వామి కొలువై వున్న దివ్యక్షేత్రాలలో తమిళనాడులోని ఆరు క్షేత్రాలు ఎంతో మహిమాన్వితమైనవి. అవే పళని, తిరుత్తణి, తిరుచందూరు, పళముదిర్‌చోళై, తిరుప్పారకుండ్రం మరియు స్వామి మలై, ఈ ఆరు క్షేత్రాలలో కార్తికేయుని దర్శించినవారికి ఎన్నో జన్మల పాపాలు నశిస్తాయి. సర్వసౌభాగ్యాలు లభిస్తాయి.

ఆ శ్రీనివాసుని దయవలన నేను ఇప్పటిదాకా ఆ స్వామి లీలలపై పదహారు పుస్తకాలు రచించడం జరిగింది. అవన్నీ భక్తులను ఎంతగానో ఆనందపరుస్తున్నాయంటే అదంతా ఆ స్వామి అనుగ్రహం తప్ప మరొకటి కాదు. వీటిలో శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం, శ్రీ లక్ష్మీ నరసింహ వ్రతకల్పం, శ్రీ ఆనంద ఆంజనేయం, భక్తులను ఎంతగానో అలరిస్తున్నాయి. ఈ మూడు వ్రతాలు నిత్యం ఎందరో భక్తుల గృహాలలోను, ఎన్నో ఆలయాలలోను ఆచరింపబడుతున్నాయి. ఇంతకు మించిన భాగ్యం ఏముంటుంది.

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుడు భక్తసులభుడు. ఆ స్వామిని నమ్మి కొలచినవారికి ఎటువంటి ఆపదా కలుగదు. ఆంధ్రదేశంలోనూ, తమిళనాడులోనూ, ఎందరో భక్తులకు స్వామి కులదైవం. ఈ పుస్తకం రాయగలగటం పూర్తిగా ఆ స్వామి అనుగ్రహం తప్ప మరొకటి కాదు. ఈ పుస్తకం రాస్తున్నంతసేపు ఆ స్వామి బాలసుబ్రహ్మణ్యం రూపంలో నా ఎదురుగా కూర్చునేవాడు. నేను రాస్తున్న కాగితాలవంక చిరునవ్వుతో చూస్తుండేవాడు. నా టేబుల్‌పై చేతులు ఆనించి తలవంచి ఏం రాస్తున్నానా అని ముందుకు వంగి చిరునవ్వుతో చూస్తున్న ఆ బాలసుబ్రహ్మణ్యేశ్వరుని దివ్యరూపం తలచుకుంటే ఇప్పటికీ నా ఒళ్ళు గగుర్పొడుస్తుంది. ఆ దివ్య తేజస్సు గురించి మాటలలో చెప్పలేం. ఎంతో ముద్దు గొలుపుతున్న ఆ అద్భుతరూపం అక్షరాలలో వర్ణించలేము.



ఈ సుబ్రహ్మణ్య వ్రతం పూర్తిగా ఆ స్వామి అనుగ్రహంతోనే రచింపబడింది. ఇది ఆచరించటం చాలా తేలిక. ఈ వ్రతం ఆచరించినవారికి ఆ కార్తికేయుని అనుగ్రహం తప్పక కలుగుతుంది. దీనిలో ఏమాత్రం సందేహం లేదు. ఏమైనా గ్రహబాధలతో బాధ పడుతున్నవారు ఈ వ్రతం ఆచరిస్తే వెంటనే ఆ బాధలనుండి విముక్తులవుతారు. సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. సంతానం కావలసినవారికి ఈ వ్రతానికి మించిన ఉపాయం మరొకటి లేదు. ఆర్థిక బాధలతో సతమతమవుతున్నవారు ఈ వ్రతం ఆచరిస్తే వెంటనే ఆ సమస్యలనుండి బయటపడతారు.

ఈ సుబ్రహ్మణ్య వ్రతం పూర్తిగా ఆ స్వామి అనుగ్రహంతోనే రచించడం జరిగింది. కలం పట్టుకున్నది నేనైనా ప్రతీ అక్షరం ఆ స్వామి అనుగ్రహంగానే భావిస్తున్నాను. ఈ వ్రతం ఆచరించటం ఎంతో సులభం. ఆచరించిన ప్రతి ఒక్కరికీ ఆ శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి అనుగ్రహం కలగాలని ఆ స్వామిని మనసారా వేడుకుంటున్నాను.

ఈ పుస్తకాన్ని చక్కగా డి.టి.పి. చేయించి అచ్చు వేయించిన శ్రీ వాసవీ ప్రింటర్స్ శ్రీమతి & శ్రీ పి.జగదీష్‌కు ఆ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను. ఈ పుస్తక ప్రథమ ముద్రణకి సహకరించిన శ్రీ ఆలమూరి సత్యదేవ్, శ్రీమతి పరిమళ గార్లకు (ఆలమూరి ఫౌండేషన్, హైదరాబాద్) నా కృతజ్ఞతలు. ఇదంతా కూడా కేవలం స్వామివారి ప్రేరణ అనుకుంటున్నాను. వీరికి, వీరి కుటుంబ సభ్యులందరికి ఆ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను.

ఈ పుస్తక రచనకు ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ వ్రతకల్పం ఆచరించిన మీకు, వ్రత కథలు విన్నవారికి, ప్రసాదం స్వీకరించినవారికి సకల ఆయురారోగ్య సౌభాగ్యాలు కలగాలని ఆ శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని ప్రార్థిస్తున్నాను.

సర్వేజనా సుఖినోభవంతు ః

**శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్య కటాక్ష సిద్ధిరస్తు**
**సమస్త సన్మంగాళానిభవంతు ః**

హైదరాబాద్. తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి
04-08-2013

# ఈ వ్రతం ఎలా ఆచరించాలి?

⇨ ఈ పుస్తకాన్ని ఎవ్వరైనా, ఎప్పుడైనా, వయసుతోగానీ, కులంతోగానీ నిమిత్తం లేకుండా పఠించవచ్చును. స్త్రీ, పురుష భేదం లేదు, ఏ నెలలోనైనా, ఏ రోజులలోనైనా చదువవచ్చును. ఏకాదశి, పౌర్ణమి తిథులందు గానీ, కృత్తికా నక్షత్రంనాడు కానీ పఠిస్తే మరింత శుభప్రదం. మంగళవారం నాడు చదివితే చాలా మంచిది. ప్రతీనెలా వచ్చే షష్టి తిథినాడు ఈ వ్రతం ఆచరిస్తే జన్మజన్మల పాపాలు నశిస్తాయి. ఎంతో పుణ్యఫలం కలుగుతుంది. ఎటువంటి ఆపదలూ కలుగవు, అపమృత్యుభయం ఉండదు. చదివే శక్తిలేనివారికి, వారి బంధువు లెవరైనా చదివి వినిపించినా, ఎంతో ఫలం కలుగుతుంది. ఈ వ్రతం ఆచరించే రోజున తప్పక ఉపవాసం ఉండాలనే నియమం లేదు.

⇨ శ్రీ సుబ్రహ్మణ్య వ్రతం ఆచరించటం చాలా సులభం. ఇంట్లోకానీ, శ్రీ స్వామివారి ఆలయంలో కానీ ఆచరింపవచ్చును. ఈ వ్రతం ఆచరించేముందు ఒక్కసారి మనస్సులోనే గణపతికి, నవగ్రహదేవతలకు, అష్టదిక్పాలకులకు నమస్కరించవలెను. అటుతరువాత మీ పేరు, మీ కుటుంబ సభ్యుల పేర్లు, గోత్రం మనస్సులో తలచుకొని వ్రతం మొదలు పెట్టవలెను. అష్టోత్తర నామాలు పఠించాలి. శ్రీ స్వామివారి అథాంగపూజ చేసి తరువాత ఈ పుస్తకంలోని ఆరు కథలను చదివి స్వామివారికి ఏ ఫలమునైనా నివేదింపవచ్చును.

⇨ ప్రతీ మంగళవారం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో అర్చకులచేత ఈ పుస్తకం పఠించబడితే ఆ ఆలయాలు మహా మహిమాన్వితమైన దివ్యక్షేత్రాలుగా పేరొందుతాయి. అక్కడకు వచ్చే భక్తులందరికీ షణ్ముఖుని అనుగ్రహం కలిగి సుఖశాంతులతో జీవిస్తారు.

⇨ ఈ వ్రతం ఆచరించేటప్పుడు భార్య, భర్తలు ఇద్దరూ తప్పక కలిసి ఆచరించాలనే నియమం లేదు. భర్తకు వీలున్నప్పుడు భర్త, భార్యకు వీలున్నప్పుడు భార్య, ఇలా ఎవరి వీలును బట్టి వారు ఆచరించవచ్చును. వీలున్నప్పుడు ఇద్దరూ కలిసి ఆచరింపవచ్చును.

⇨ దురదృష్టవశాత్తు భార్యను కోల్పోయిన పురుషులు కానీ, భర్తను కోల్పోయిన స్త్రీలు కాని కూడా నిరభ్యంతరంగా ఈ వ్రతం ఆచరింపవచ్చును. ఈ వ్రతం ఆచరించినవారికి పూర్తి



మనశ్శాంతి కలుగుతుంది.

⇨ సంతానం కోరేవారు వరుసగా ఆరు మంగళవారాలు ఈ వ్రతం ఆచరిస్తే త్వరలోనే చక్కటి సంతానాన్ని పొందుతారు. అలాగే ఆర్థిక సమస్యలతో ఉన్నవారు ఆరు వారాలు ఈ వ్రతం ఆచరిస్తే ఆ సమస్యలన్నీ వెంటనే తొలగిపోతాయి. మార్గశిర శుద్ధషష్టినాడు ఈ వ్రతం ఆచరిస్తే శుభప్రదం.

⇨ వివాహం కాని యువతీ యువకులు ఆ వ్రతం ఆచరిస్తే వారికి చక్కటి జీవితభాగస్వామి లభిస్తాడు. ఏ పనులైనా చాలా ఆలస్యం అవుతుంటే ఈ వ్రతం ఆచరిస్తే అవాంతరాలు అన్నీ తొలగిపోయి ఆ పనులు త్వరగా, విజయవంతంగా జరగుతాయి. ఎటువంటి గ్రహబాధలు అనుభవిస్తున్నవారైనా ఈ వ్రతం ఆచరిస్తే వాటినుండి పూర్తి ఉపశమనం కలుగుతుంది.

⇨ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుని ఏ దివ్యక్షేత్రంలోనైనా ఈ వ్రతం ఆచరిస్తే కొన్ని కోట్ల జన్మల పాపఫలం నశిస్తుంది. వ్రతం ఆచరించిన వెంటనే శరీరంలోని రోగాలన్నీ తొలగిపోతాయి. శరీరానికి నూతన తేజస్సు కలుగుతుంది. దీర్ఘాయుష్షుతో సుఖంగా జీవిస్తారు.

⇨ దూరదేశాలలో ఉండే మీ పిల్లల నిమిత్తం, మీ బంధువుల నిమిత్తం మీరు కూడా చదువవచ్చును. వారికి సంతానం, వివాహం, ఉద్యోగం, ఆరోగ్యం కొరకు ఈ పుస్తకాన్ని వరుసగా మూడు మంగళవారాలు స్వామివారి ఆలయంలో కానీ మీ గృహంలో కానీ చదివితే వెంటనే ఫలితం కలుగుతుంది.

⇨ ఏదైనా శుభకార్యం తలపెట్టినప్పుడు ఈ వ్రతం ఆచరిస్తే శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి అనుగ్రహంతో ఆ కార్యం విజయవంతమవుతుంది. మనస్సు అశాంతిగా ఉన్నప్పుడు కానీ, ఏదైనా అనుకోని కష్టం కలిగినప్పుడుకానీ, తిథి, వార, నక్షత్రాలతో నిమిత్తం లేకుండా ఈ వ్రతం ఆచరించవచ్చు. ఆ స్వామి అనుగ్రహంతో మనస్సు ప్రశాంతమై ఆ కష్టం వెంటనే తొలగిపోతుంది.

⇨ వీలున్నప్పుడు ఈ వ్రతం పురోహితుని సహకారంతో ఆచరిస్తే మంచిది. కలశస్థాపన చేసి అష్టదిక్పాలకులను, నవగ్రహదేవతలను, లోకపాలకులను మండపంపై ఆయా దిక్కులలో ఆవాహన చేసి పూర్తి విధానంతో ఈ వ్రతం చేస్తే శుభప్రదం.

ఈ విధంగా ఏ రీతిలోనైనా, ఏ రోజైనా, ఈ పుస్తకం పఠించి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి అనుగ్రహం పొందవచ్చు.

– తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

## అధాంగపూజా

| | |
|---|---|
| ఓం అమరస్తుపాదయుగళాయ నమః | పాదేపూజయామి |
| ఓం ద్విషడ్బాహవే నమః | బాహూన్ పూజయామి |
| ఓం ద్విషేణ్ణేత్రాయ నమః | నేత్ర పూజయామి |
| ఓం ద్విషణ్ముఖాయ నమః | ముఖాన్ పూజయామి |
| ఓం ద్విషట్కర్ణాయ నమః | కర్ణాన్ పూజయామి |
| ఓం దయాహృదయా నమః | హృదయం పూజయామి |
| ఓం గృహ్యాయ నమః | గృహ్యం పూజయామి |
| ఓం సునాశాకాయ నమః | నాశికం పూజయామి |
| ఓం ఫాలనేత్రసుతాయ నమః | ఫాలం పూజయామి |
| ఓం జ్ఞాన శక్తికరాయ నమః | హస్తాన్ పూజయామి |
| ఓం కటిన్యస్తపాణయే నమః | కటిం పూజయామి |
| ఓం లంబోధానుజాయ నమ | ఉదరం పూజయామి |
| ఓం సువిశాల వక్షసేవ నమః | వక్షస్థలం పూజయామి |
| ఓం శితికంఠసుతాయ నమః | కంఠం పూజయామి |
| ఓం సర్వసేవా పతయే నమః | సర్వాణ్యంగాని పూజయామి |

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అధాంగ పూజాం సమర్పయామి.



## శ్రీ సుబ్రహ్మణ్యాష్టోత్తర శతనామావళిః

**ప్రతి నామమునకు ముందు 'ఓం' అనియు చివర 'నమః' అనియు పూజించవలెను.**

స్కందాయ
గుహాయ
షణ్ముఖాయ
ఫాలనేత్రసుతాయ
ప్రభవే
పింగళాయ
కృత్తికాసూనవే
శిఖివాహనాయ
ద్విషడ్భుజాయ
ద్విషణ్ణేత్రాయ
శక్తిధరాయ
పిశితాశ ప్రభంజనాయ
ఓం తారకాసుర
సంహారిణే
రక్షోబల విమర్ధనాయ
మత్తాయ
ప్రమత్తాయ
ఉన్మత్తాయ
సురసైన్య సురక్షకాయ
దేవసేనాపతయే
ప్రాజ్ఞాయ
కృపాళవే
భక్తవత్సలాయ
ఉమాసుతాయ
కుమారాయ
క్రౌంచధారణాయ
సేనాన్యే
అగ్ని జన్మనే
విశాఖాయ
శంకరాత్మజాయ
శివసూనవే
గణస్వామినే
సర్వస్వామినే
సనాతనాయ
అనంత శక్తయే
అక్షోభ్యాయ
పార్వతీప్రియ నందనాయ
గంగాసుతాయ
శరోద్భూతాయ
ఆహూతాయ
పావకాత్మజాయ
జృంభాయ
ప్రజృంభాయ
ఉజ్జృంభాయ
కమలాసన సంస్తుతాయ
ఏకవర్ణాయ
ద్వివర్ణాయ
త్రివర్ణాయ
సుమనోహరాయ
చతుర్వర్ణాయ
పంచవర్ణాయ
ప్రజాపతయే
అహఃపతయే
అగ్ని గర్భాయ
శమీగర్భాయ
విశ్వరేతసే
సురారిఘ్నే
హరిద్వర్ణాయ
శుభకరాయ
వటవే
వటువేషభృతే
పూష్ణే
గభస్తయే
గహనాయ
చంద్రవర్ణాయ
కళాధరాయ
మాయాధరాయ
కైవల్యాయ
శంకరాత్మనే
విశ్వయోనయే
అమేయాత్మనే
తేజోనిధయే
అనామయాయ
పరమేష్ఠినే
పరబ్రహ్మణే
వేదగర్భాయ
విరాట్సుతాయ
పుళిందకన్యాభర్త్రేయ
మహాసారస్వతావబుతాయ
అశ్రితాఖిలదాత్రే
చోరఘ్నాయ
రోగనాశనాయ
అనంత మూర్తయే
ఆనందాయ
శిఖండీకృతకేతనాయ
డంభాయ
పరమడంభాయ
మహాడంభాయ
వృషాంకపయే
కారణోపాత్తదేహాయ
కారణాతీత విగ్రహాయ
అనీశ్వరాయ
అమృతాయ
ప్రాణాయామ పరాయణాయ
విరుద్ధ హంత్రే
వీరఘ్నాయ
రక్తాస్యాయ
సుబ్రహ్మణ్యాయ
గుహాయ
ప్రీతాయ
బ్రహ్మణ్యాయ
బ్రాహ్మణప్రియాయ
వంశవృద్ధికరాయ
వేదవేద్యాయ
అక్షయ ఫలప్రదాయ
సమస్తలోక సద్గురువే
అసురానీకమర్ధనాయ
వల్లీదేవసేనా సమేత
శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామినే

## శ్రీ వల్ల్యష్టోత్తర శతనామావళిః

ప్రతి నామమునకు ముందు 'ఓం' అనియు చివర 'నమః' అనియు పూజించవలెను.

మహావల్ల్యై
శ్యామతనవే
సర్వాభరణభూషితాయై
పీతాంబర్యై
శశిసుతాయై
దివ్యాయై
అంబుజధారిణ్యై
పురుషాకృతయే
బ్రాహ్మ్యై
నళిన్యై
జ్వాలానేత్రికాయై
లంబాయై
ప్రలంబాయై
తాటంకిన్యై
నగేంద్రతనయాయై
శుభరూపాయై
శుభంకరాయై
వ్యలంబకరాయై
ప్రత్యూషాయై
మహేశ్వర్యై
తుంగస్తన్యై
సకంచుకాయై
అణిమాయై
మహాదేవ్యై
గుంజాయై
మాల్యధరాయై
వైష్ణవ్యై
త్రిభంగ్యై
ప్రవాళవదనాయై
మనోన్మన్యై
చాముండాయై
స్కందభార్యాయై
సత్ప్రభాయై
నిర్గుణాయై
ఓజసే
తేజసే
అనామయాయై
పరమేష్ఠిన్యై
గురుబ్రాహ్మణ్యై
చంద్రవర్ణాయై
కళాధరాయై
పూర్ణచంద్రాయై
స్వర్గాధ్యక్షాయై
జయాయై
సిద్ధసేవితాయై
ద్వినేత్రాయై
ద్విభుజాయై
ఆర్యాయై
ఇష్టసిద్ధిప్రదాయికాయై
సామ్రాజ్యాయై
స్వధాకారాయై
కాంచనాయై
హేమభూషణాయై
మహావల్ల్యై
వారాహ్యై
సద్యోజాతయై
పంకజాయై
సర్వాధ్యక్షాయై
సురాధ్యక్షాయై
లోకాధ్యక్షాయై
సుందర్యై
ఇంద్రాణ్యై
వరలక్ష్మ్యై
బ్రాహ్మీవిద్యాయై
సరస్వత్యై
కుమార్యై
భద్రకాళ్యై
దుర్గాయై
జనమోహిన్యై
సురాగ్రజాయై
సుస్వప్నాయై
సుషుప్తేచ్ఛాయై
సాక్షిణ్యై
పురాణ్యై
పుణ్యరూపిణ్యై
కైవల్యాయై
కళాత్మికాయై
ఇంద్రాణ్యై
ఇంద్రరూపిణ్యై
ఇంద్రశక్త్యై
పరాయణాయై
కావేర్యై
తుంగభద్రాయై
క్షీరాబ్ధితనయాయై
కృష్ణవేణ్యై
భీమనద్యై
పుష్కరాయై
సర్వతోముఖ్యై
మూలాధిపాయై
పరాశక్త్యై
సర్వమంగళకరాణాయై
బిందుస్వరూపిణ్యై
శర్వాణ్యై
యోగిన్యై
పాపనాశిన్యై
ఈశానాయై
లోకమాత్రే
పోషిణ్యై
పద్మవాసిన్యై
గుణత్రయాయై
దయారూపిణ్యై
నాయకాయై
నాగధారిణ్యై
అశేషహృదయాయై
దేవ్యై
శరణాగత రక్షణ్యై
సౌమ్యాయై
శ్రీవల్ల్యై



## శ్రీ దేవసేనాష్టోత్తర శతనామావళిః

ప్రతి నామమునకు ముందు 'ఓం' అనియు చివర 'నమః' అనియు పూజించవలెను.

పీతాంబర్యై
దేవసేనాయై
దివ్యాయై
ఉత్పలధారిణ్యై
అణిమాయై
మహాదేవ్యై
కరాళిన్యై
జ్వాలానేత్ర్యై
మహాలక్ష్మ్యై
వారాహ్యై
బ్రహ్మవిద్యాయై
సరస్వత్యై
ఉషాయై
ప్రకృత్యై
శివాయై
సర్వాభరణభూషితాయై
శుభరూపాయై
శుభంకర్యై
ప్రత్యూషాయై
మహేశ్వర్యై
అచింత్యశక్త్యై
అక్షోభ్యాయై
చంద్రవర్ణాయై
కళాధరాయై
పూర్ణచంద్రాయై
సర్వస్యై
యక్షాయై
ఇష్టసిద్ధిప్రదాయికాయై
మాయంధరాయై
మహామాయాయై
ప్రవాళవదనాయై
అనంతాయై
ఇంద్రాణ్యై
ఇంద్రరూపిణ్యై
ఇంద్రశక్త్యై
పరాయణ్యై
లోకాధ్యక్షాయై
సురాధ్యక్షాయై
ధర్మాధ్యక్షాయై
సుందర్యై
సుజాతగ్రతాయై
సుస్వరూపాయై
స్కందభార్యాయై
సత్ప్రభాయై
ఐశ్వర్యాసనాయై
అనింద్యాయై
కావేర్యై
తుంగభద్రాయై
ఈశానాయై
లోకమాత్రమే
ఓజసే
తేజసే
అఘాపహాయై
సద్యోజాతాయై
స్వరూపాయై
భోగిన్యై
పాపనాశిన్యై
సుఖాసనాయై
సుఖకారాయై
మహాఛత్రాయై
పురాతన్యై
వేదాయై
వేదరసాయై
వేదగర్భాయై
త్రయీమయ్యై
సామ్రాజ్యాయై
సుధాకారాయై
కాంచనాయై
హేమభూషణాయై
మూలాధిపాయై
పరాశక్త్యై
పుష్కరాయై
సర్వతోముఖ్యై
దేవసేనాయై
ఉమాయై
పార్వత్యై
విశాలాక్ష్యై
హేమవత్యై
సనాతనాయై
బహువర్ణాయై
గోపవత్యై
సర్వస్వాయై
మంగళకారిణ్యై
అంబాయై
గణాంబాయై
విశ్వాంబాయై
సుందర్యై
త్రిపురసుందర్యై
మనోన్మన్యై
చాముండాయై
నాయికాయై
నాగధారిణ్యై
స్వధాయై
విశ్వతోముఖ్యై
సురాధ్యక్షాయై
సర్వేశ్వర్యై
గుణత్రయాయై
దయారూపిణ్యై
అభియాతిగాయై
ప్రాణశక్త్యై
పరాదేవ్యై
శరణాగతరక్షణాయై
అశేషహృదయాయై
దేవ్యై
సర్వేశ్వర్యై
దేవపూజ్యాయై
సిద్ధిదాయై
దేవసేనాయై

# శ్రీ సుబ్రహ్మణ్య వ్రతం

### మొదటి అధ్యాయం

## పళని మాహాత్మ్యం

పూర్వకాలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పళనికి కొద్దిదూరంలో వల్లీపురం అనే గ్రామం ఉండేది. ఆ గ్రామంలో నటరాజన్ అనే వ్యక్తి ఉండేవాడు. అతడు బట్టలు నేసే పనిలో ఎంతో ప్రావీణ్యత సంపాదించాడు. ఎంతో నిరాడంబరమైన జీవితం సాగిస్తూ తాను సంపాదించిన దాంట్లో కొంత దాన ధర్మాలకు వినియోగించేవాడు. అతడి భార్య సుమతి కూడా భర్తకు అన్ని విధాల ఎంతో సహాయపడేది. భార్యాభర్తలిద్దరూ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి భక్తులై ఎల్లప్పుడూ ఆ స్వామినే కొలుస్తూ ఉండేవారు.

నటరాజన్ దంపతులకు అన్నీ ఉన్నప్పటికీ సంతానం లేనికొరత బాధపెడుతూ ఉండేది. సంతానం కోసం వారెన్నో వ్రతాలు చేశారు. నోములు చేశారు. అయినా ఫలితం లేకపోయింది. వివాహం జరిగి పన్నెండు సంవత్సరాలయినా సంతానం కలగకపోవటం వారినెప్పుడూ బాధిస్తూ ఉండేది. ప్రతిరోజు వారి ఇలవేల్పు శ్రీ కుమారస్వామిని తమకు సంతానం ప్రసాదించవలసినదిగా ప్రార్థించేవారు. తమతోటివారందరూ చక్కటి పిల్లాపాపలతో ఆడుకుంటూ ఉంటే తమకు మాత్రం పిల్లలు లేరని బాధపడేవారు. ఏ జన్మలో చేసిన పాపం వలననో కలగటం లేదని తలచేవారు. ఆ బాధ వారిని రోజు రోజుకూ కృంగదీయసాగింది.

అయితే ఆ దంపతులు మాత్రం కుమారస్వామిని కొలవటం మానలేదు. నిత్యం యథావిధిగా ఆ స్వామిని కొలుస్తూనే ఉన్నారు. సుబ్రహ్మణ్యేశ్వరుడు భక్త వత్సలుడు. తనను త్రికరణశుద్ధిగా నమ్మి కొలచినవారిని కంటికి రెప్పలా కాపాడే అమృతమూర్తి. ఆ



స్వామిని మనస్ఫూర్తిగా కొలచేవారికి సర్వ సౌభాగ్యాలూ లభిస్తాయి. ఎటువంటి ఋణబాధలు ఉండవు. చక్కటి సంతానం కలుగుతుంది. అకాల మృత్యుభయం ఉండదు.

రోజులిలా గడుస్తుండగా ఒకనాడు ఆ ఊరికి ఒక సాధువు వచ్చాడు. ఆ సాధువు ఎంతో మహిమ కలవాడని ప్రజలు చెప్పుకున్నారు. నటరాజన్ దంపతులు ఆ సాధువుకు నమస్కరించి తమ బాధ చెప్పారు. అప్పుడు ఆ సాధువు వారితో ఇలా అన్నాడు. నాయనలారా మీరు పూర్వజన్మలో చేసిన ఒక పాపం వలన మీకు సంతానం కలగడం ఆలస్యమైంది. వచ్చే మంగళవారం ఎంతో పుణ్యదినం. ఎంతో పవిత్రమైనది. షష్టి తిథి, కృత్తికా నక్షత్రంతో కలసి వస్తున్నది. ఎన్నో సంవత్సరాలకు గానీ ఈ విధంగా రావడం జరగదు. ఎంతో పవిత్రమైన ఆ రోజున మీరిద్దరూ పళని పుణ్యక్షేత్రం చేరి కార్తికేయుని దర్శించండి. ఆ స్వామి దివ్యదర్శనంతో మీ పూర్వజన్మ పాపం నశించి త్వరలోనే పండంటి కుమారుడు కలుగుతాడు అని చెప్పాడు.

నటరాజన్ దంపతులిద్దరూ సోమవారం సాయంత్రం పళనికి ఎడ్లబండిలో బయలుదేరారు. వీరి ఊరినుండి పళనికి నాలుగైదు గంటల ప్రయాణం. రాత్రికి అక్కడే ఉండి మరునాడు మంగళవారం నాడు ఆ స్వామిని దర్శించుకుందామని తలచారు. ఇంతలో ఒక కొండ ప్రాంతం వచ్చింది. ఆ కొండప్రక్కగా బండి నెమ్మదిగా వెళుతుండగా ఒక్కసారిగా రెండు ఎడ్లు ఆగిపోయాయి. బండి ముందుకు సాగటం లేదు. బండి నడిపేవారికి ఎంత ఎదిరించినా ఎడ్లు ఎందుకు ముందుకు సాగటంలేదో అర్థం కావడం లేదు. నటరాజన్‌తో కలిసి ఇద్దరూ బండి దిగారు. ఎదురుగా కనబడిన దృశ్యం చూసి ఆశ్చర్యపోయారు. భయం కూడా కలిగింది. ఎదురుగా రెండు సర్పాలు పడగెత్తి నృత్యం చేస్తున్నాయి. వాటిని చూసిన ఎద్దులు బెదిరి ముందుకు సాగటం లేదు.

బండివాడు ఏదో చప్పుడు చేయబోతుంటే నటరాజన్ వద్దని వారించాడు. ఆ సర్పాలకు నమస్కరించి తమకు దారి ఇవ్వమని అడిగాడు. కానీ అవి ఏమాత్రం కదలలేదు. అక్కడే నృత్యం ఆడసాగాయి. అలా దాదాపు అరగంట గడిచింది. ఇంతలో వారిదారిలోనే కొంచెం ముందున పక్కన కొండపైనుంచి పెద్ద బండరాయి అత్యంత వేగంగా దొర్లుతూ ఎదురుగా రోడ్డుపై పడి ముక్కలైంది. ముక్కలన్నీ అటూ ఇటూ చెల్లాచెదురుగ పడ్డాయి. ఇది జరిగిన కాసేపటికి ఆ సర్పాలు రెండూ పక్కనే ఉన్న పొదలలోకి జర జరా పాకుతూ వెళ్ళిపోయాయి.

నటరాజన్‌కు జరిగినది అర్థమైంది. ఆ సుబ్రహ్మణ్యేశ్వరుడే తమను రక్షించడానికి ఈవిధంగా వచ్చాడు. లేకపోతే ముందుకు సాగి ఆ బండరాయి తమబండిపై పడి

తామందరూ మరణించి ఉండేవారు. ఆ కార్తికేయుడు తమను రక్షించడానికే, ముందుకు వెళ్ళకుండా సర్పరూపంలో వచ్చాడని గ్రహించాడు. తమను రక్షించినందుకు ఆ స్వామిని ఎన్నోవిధాల స్తుతించాడు. ప్రయాణం ముందుకు సాగించి రాత్రికి పళని క్షేత్రం చేరాడు. ఉదయాన్నే ఆ క్షేత్రంలో కొలువున్న బాలసుబ్రహ్మణ్యేశ్వరుని దర్శించాడు. అటు తరువాత సాయంకాలం తిరిగి బయలుదేరి వారి గ్రామానికి చేరుకున్నారు. ఆ స్వామి అనుగ్రహంతో కొద్దికాలంలోనే వారికి చక్కటి పుత్రుడు జన్మించాడు. సుబ్రహ్మణ్యప్రసాదితుడు కాబట్టి అతడికి బాలసుబ్రహ్మణ్యం అని పేరు పెట్టారు. పుత్రునితో కలిసి నటరాజన్ దంపతులు ఆ స్వామిని సేవిస్తూ కలకాలం సుఖంగా జీవించారు.

సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం షణ్ముఖనాథం సుబ్రహ్మణ్యం

సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం శంకరపుత్రం సుబ్రహ్మణ్యం



# శ్రీ సుబ్రహ్మణ్య వ్రతం

## రెండవ అధ్యాయం

## చిన్న శెట్టి కథ

తమిళనాడులోని శ్రీ సుబ్రహ్మణ్య క్షేత్రాలలో తిరుత్తణి ఎంతో ప్రసిద్ధమైన క్షేత్రం. ఇక్కడ వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుడు ఎంతో మాహాత్మ్యము కలవానిగా ఆరాధింపబడుతున్నాడు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరునికి కార్తికేయుడు, స్వామినాథన్, వేలాయుధం, కుమారస్వామి, షణ్ముఖుడు అనే పేర్లు కూడా ప్రసిద్ధి. స్వామివారి వాహనం నెమలి. స్వామివారి జెండాపై కోడి ఉంటుంది. కోడి జ్ఞానానికి ప్రతీక. సర్పం స్వామివారికి సంకేతంగా భావిస్తారు.

పూర్వకాలంలో తిరుత్తణి సమీపంలోని పుత్తూరులో చిన్నశెట్టి అనే వ్యాపారస్తుడు ఉండేవాడు. అతడు వెండి, బంగారు వ్యాపారాలతోపాటు బట్టలవ్యాపారం కూడా చేసి ఎంతో ధనం సంపాదించాడు. కానీ విపరీతమైన లోభత్వంతో ఉండేవాడు. ఎంత పేదవాడికి ఏమాత్రం దానం చేసి ఎరుగడు. అతడికి చాలాకాలం సంతానం కలుగలేదు. ఒకనాడు తనకు సంతానం కలిగితే ఒక అడుగు ఎత్తైన వెండి సర్పపు రూపం తిరుత్తణి స్వామివారికి కానుకగా సమర్పించుకుంటానని మ్రొక్కుకున్నాడు. కార్తికేయుని అనుగ్రహంతో భార్య చిత్రావతి త్వరలోనే గర్భం దాల్చి పండంటి కుమారుడిని కన్నది. అనతికాలంలోనే ఆ స్వామి అనుగ్రహంతో చిన్న శెట్టి వ్యాపారం కూడా అభివృద్ధి చెందింది.

చిన్న శెట్టి వ్యాపార పనులలో పడి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఇచ్చినమాట మరచిపోయాడు. ఒకనాడు చిన్నశెట్టి కుమారునికి ఏదో తీవ్రమైన జబ్బు చేసింది.

ఎన్నిమందులు వేసినా నయం కాలేదు. అప్పుడు చిన్నశెట్టికి తాను కార్తికేయునికి ఇచ్చినమాట గుర్తుకు వచ్చింది. స్వామీ నా పిల్లవానికి ఈ జబ్బునుంచి కాపాడు. పూర్తి ఆరోగ్యం ప్రసాదించు. నీకు అడుగు ఎత్తు గల సర్పాలు రెండింటిని సమర్పిస్తాను అని మనస్సులో మ్రొక్కుకున్నాడు. పిల్లవాడు అనారోగ్యం నెమ్మదిగా తగ్గి కొద్దిరోజులలోనే పూర్తిగా ఆరోగ్యవంతుడైనాడు.

ఇంతలో దసరా, దీపావళి పండుగలు వచ్చాయి. చిన్నశెట్టి వ్యాపారాలన్నింటికీ ఇది చాలా రద్దీ సమయం కావటంతో ఒక్కక్షణం కూడా తీరిక లేకపోయింది. షణ్ముఖునికి ఇచ్చినమాట మరిచిపోయాడు. మధ్యలో ఒకసారి గుర్తుకు వచ్చినా ఈ పండగలు అయిన తరువాత వెళ్ళవచ్చులెమ్మని అనుకున్నాడు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి ఆగ్రహం వచ్చింది. మానవ నైజం ఇంతేకదా అనుకున్నాడు. తన శక్తి చూపాలని తలచాడు. అప్పుడు గానీ చిన్నశెట్టికి బుద్ధి రాదని తలచాడు.

ఆ మరునాటి రాత్రి సుబ్బిశెట్టి ఒక్కసారి గట్టిగా అరుస్తూ మధ్యరాత్రిలో లేచాడు. తన మంచం చుట్టూ పెద్ద సర్పాలు తిరుగుతున్నట్టు కల వచ్చింది. ఆ కలతో ఎంతో భయపడి మెలకువ వచ్చి కళ్ళు తెరచి మంచంమీద కూర్చున్నాడు. చిన్నశెట్టికి నిజంగానే భయంకరంగా పడగవిప్పి ఆడుతున్న సర్పాలు నేలపై కనపడ్డాయి. చిన్నశెట్టి పై ప్రాణాలు పైనే పోయాయి. ఒక్కసారిగా ఇన్ని సర్పాలు ఎక్కడినుంచి వచ్చాయో భయపడుతూ భార్యను నిద్రలేపాడు.

భయంతో వణికిపోతూ భార్యను తమ మంచం చుట్టూ ఉన్న పాములను చూడమన్నాడు. ఆశ్చర్యంగా భార్య చిత్రావతికి ఒక్కసర్పం కూడా కనపడలేదు. ఏమండీ, మీకేదో కల వచ్చినట్లుంది. ఇక్కడ ఒక పాము కూడా లేదు. కళ్ళుమూసుకుని పడుకోండి అని తాను నిద్రపోయింది. కానీ చిన్నశెట్టికి ఏమాత్రం నిద్ర రావటం లేదు. కాలు కింద పెడితే కాటు వేసేలా ఉన్నాయి ఆ సర్పాలు. కాసేపటికి భార్యను మళ్ళీ నిద్రలేపాడు. చిత్రావతి విసుక్కుని మంచం దిగి విబూధి తెచ్చి ఇది రాసుకుని పడుకోండి అన్నది. విబూధి రాసుకున్నాడే కానీ నిద్రపట్టడం లేదు. కళ్ళు తెరచిచూస్తే మళ్ళీ బుస కొడుతూ దాదాపు పది పాములు కనపడ్డాయి.

అప్పుడు చిన్నశెట్టికి తాను షణ్ముఖునికి ఇచ్చినమాట గుర్తుకువచ్చింది. మాట తప్పినందువలననే ఆ స్వామి ఆగ్రహానికి గురి అవటం వలన ఈవిధంగా జరిగిందని గ్రహించాడు. స్వామీ కార్తికేయా! నన్ను క్షమించు తండ్రీ! ఈ క్షణంలోనే నేను ఆ వెండి సర్పపు రూపులను తయారుచేయించడానికి కావలసిన ధనాన్ని తీసి పక్కన పెడతాను.



రేపే ఆ పనికి పురమాయిస్తాను. నన్ను క్షమించు, అని చెంపలు వేసుకున్నాడు. కరుణామయుడైన షణ్ముఖుడు చిన్నశెట్టి అనుగ్రహించాడు. అక్కడ సర్పాలన్నీ క్షణంలో మాయమైనాయి. చిన్నశెట్టి ఏమాత్రం ఆలస్యం చేయకుండా మంచం దిగి ధనాగారం వద్దకు వెళ్ళి స్వామి పనికి కావలసిన ధనం తీసి ఒక పొట్లంలో కట్టి విడిగా పెట్టాడు.

మరునాడు ఉదయమే ఆ ధనాన్ని తీసుకుని మంచి వెండి సర్పపు ప్రతిమలను చేయించి ఆ వెంటనే వచ్చిన మంగళవారం నాడు తిరుత్తణి వెళ్ళి స్వామికి సమర్పించాడు. అప్పటినుంచి చిన్నశెట్టి మంచి మనస్సుతో జీవిస్తూ ఎన్నో దాన ధర్మాలు చేస్తూ కాలం గడిపాడు, జీవించినంత కాలం స్వామిని సేవిస్తూ గడిపి, చివరన ముక్తిని పొందాడు.

సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం షణ్ముఖనాధం సుబ్రహ్మణ్యం

సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం శంకరపుత్రం సుబ్రహ్మణ్యం

# శ్రీ సుబ్రహ్మణ్య వ్రతం

## మూడవ అధ్యాయం

# వెంకట్రామన్ దివ్య కథ

పూర్వకాలంలో కన్యాకుమారి సమీపంలో విష్ణుపురం అనే గ్రామంలో వెంకట్రామన్ అనే పాలు పోసేవాడు ఉండేవాడు. అతడు రోజు తన వద్దనున్న పది గేదెల పాలు పితికి, వీటినన్నింటిని పెద్ద గంగాళంలో పోసుకుని ఒక బండిపై పెట్టుకుని ఊరిలో వారికి పోసేవాడు. వెంకట్రామన్ పాలలో ఏమాత్రం నీరు కలపకుండా స్వచ్ఛమైన పాలు పోస్తుంటాడని అందరూ చెప్పుకునేవారు. వెంకట్రామన్ భార్య సుమతి. దంపతులిద్దరూ ప్రతిరోజూ పరమేశ్వరుని పూజిస్తూ ఉండేవారు. వెంకట్రామన్‌కు పరమశివుడంటే ఎంతో భక్తి. ప్రతీ సోమవారం ఉపవాసం ఉండేవాడు.

వెంకట్రామన్ దంపతులకు అన్నీ ఉన్నా సంతానం లేకపోవడం ఎంతో బాధగా ఉండేది. ఎప్పుడూ పరమేశ్వరుని సత్సంతానం ఇవ్వమని ప్రార్థించేవాడు. అందరి ఇళ్ళలో పాలు పోసిన తరువాత ఇంటికి వచ్చేదారిలో ఒక చెట్టుప్రక్కన ఉన్న కొళాయి కింద ఆ పాత్రలు కడిగేవాడు. కొంచెం మిగిలిన పాలు పక్కన ఉన్న చెట్టు మొదట్లో పోసేవాడు. ఇలా ప్రతీరోజు చేస్తుండేవాడు.

ఒకనాటి రాత్రి వెంకట్రామన్‌కు కలలో సుబ్రహ్మణ్యేశ్వరుడు దర్శనమిచ్చాడు. నాయనా! వెంకట్రామన్! నీ భక్తికి ఎంతో సంతోషించాను. నీవు ప్రతిరోజు చెట్టు మొదట్లో అందరికీ పోయగా మిగిలిన పాలు పోస్తున్నావు కదా, ఆ చెట్టుప్రక్కనే ఉన్న పొదలో ఒక దివ్య సర్పం ఉన్నది. రోజూ నీవు పోసే పాలు ఆ సర్పరాజం స్వీకరిస్తున్నది. నీవు



తెలియక చేస్తున్నప్పటికీ పాలు కొంచమే పోస్తున్నప్పటికీ ప్రతీ రోజు నీవు చేస్తున్న ఈ మంచి పని వలన నీకు ఎంతో పుణ్యం లభించినది. అంతేకాదు నిన్న నాకెంతో ప్రీతికరమైన శ్రీసుబ్రహ్మణ్యషష్టి. నిన్న కూడా ఎప్పటిలాగే అక్కడ పాలు పోశావు. ఆవిధంగా అక్కడ వున్న దివ్య సర్పానికి ఆ పవిత్ర దినాన పాలు పోసినవాడివై ఎంతో పుణ్యం సంపాదించావు. దీనివలన నేనెంతో సంతోషించాను. నీకు త్వరలోనే చక్కటి కుమారుడు జన్మిస్తాడు. నీవు ఆ కుమారుని తీసుకుని ఇక్కడకు కొద్ది దూరంలో గల నా పుణ్యక్షేత్రమైన తిరుచందూరుకి వెళ్ళి పిల్లవాడికి అక్కడే నామకరణం చేయవలసింది అని చెప్పి అంతర్ధానమయ్యాడు.

ఉదయం నిద్రలేవగానే భార్య సుమతికి తనకు వచ్చిన కలను వివరంగా చెప్పాడు. ఆ షణ్ముఖుడు తమను అనుగ్రహించినందుకు వారెంతో సంతోషపడ్డారు. వెంకట్రామన్ అప్పటినుంచి ప్రతిరోజు క్రమం తప్పకుండా ఆ చెట్టుమొదట్లో పాలు పోస్తూనే ఉన్నాడు. ఎప్పుడైనా ఆ దివ్యసర్పం కనపడుతుందేమోనని ఆత్రతగా చూసేవాడు. కానీ ఎప్పుడూ కనబడలేదు.

ఆ షణ్ముఖుని దయవలన సుమతి కొన్నిరోజులకే గర్భం దాల్చి చక్కటి పిల్లవాడిని కన్నది. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుడు చెప్పినట్లుగా ఆ పిల్లవాడిని వెంట పెట్టుకుని తిరుచందూరు బయలుదేరారు. ఆరోజులలో ఎడ్లబండీలపైననే ప్రయాణం. కొంతదూరం వెళ్ళేటప్పటికి దారి ఎదురుగా ఒక అద్భుత తేజస్సుతో ప్రకాశిస్తున్న సర్పం కనపడింది. దారి మధ్యలో పడగవిప్పి ఉన్న ఆ సర్పరాజాన్ని చూడగానే స్వామి కలలో చెప్పిన సర్పం ఇదేనని వెంకట్రామన్‌కు తోచింది. కుటుంబం అంతా బండి దిగి ఆ దివ్యసర్పానికి నమస్కరించారు. పిల్లవాడిచేత కూడా నమస్కరింపచేశారు. సర్పం వెంటనే మాయమైంది.

ప్రయాణం ముందుకు సాగించి వెంకట్రామన్ దంపతులు మరునాడు ఉదయానికి తిరుచందూరు చేరి అక్కడ కొలువై వున్న స్వామిని దర్శించారు. పిల్లవాడికి అక్కడే కార్తికేయన్ అని నామకరణం చేశారు. ఆ రాత్రి అక్కడే వుండి మరునాడు తిరిగి విష్ణుపురం చేరుకున్నారు. వెంకట్రామన్ కుటుంబం అంతా ఆ స్వామిని సేవిస్తూ కలకాలం సుఖంగా జీవించారు.

సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం షణ్ముఖనాథం సుబ్రహ్మణ్యం

సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం శంకరపుత్రం సుబ్రహ్మణ్యం

# శ్రీ సుబ్రహ్మణ్య వ్రతం

## నాల్గవ అధ్యాయం

## వెంకటశాస్త్రి దివ్య కథ

పూర్వకాలంలో మధురైనగరానికి కొద్దిదూరంలో ఒక గ్రామంలో వెంకటశాస్త్రి అనే మహాపండితుడు ఉండేవాడు. అతడు అన్ని శాస్త్రవిద్యలలోను ఎంతో ప్రావీణ్యం కలవాడిగా ప్రసిద్ధి పొందాడు. చుట్టు ప్రక్కల గ్రామాలలో ఎవరికి ఏ సలహా కావలసినా వెంకట శాస్త్రివద్దకే వచ్చేవారు. వివాహ, గృహప్రవేశాలకు ముహూర్తాలు నిర్ణయించటంలో వెంకటశాస్త్రికి సాటి లేరని జనం చెప్పుకునేవారు. ఆలయ ప్రతిష్ఠాపన ముహూర్తాలు కావలసినా ఎంతో దూర గ్రామాలనుంచి కూడా వెంకటశాస్త్రి వద్దకే వచ్చేవారు.

వెంకటశాస్త్రికి యాభై సంవత్సరాల వయస్సు వచ్చింది. ఎంతో ఆరోగ్యంగా, సుఖంగా ఉంటున్న వెంకటశాస్త్రికి ఉన్నట్టుండి ఒక చర్మవ్యాధి పట్టుకుంది. శరీరమంతా దురద రావటం, కొంచెం గోకినా పుండు పడటం జరిగేది. చర్మం అక్కడక్కడా పొలుసులు బారినట్లు ఉండేది. వెంకటశాస్త్రికి ఆయుర్వేదం కూడా పరిచయం ఉండటంచేత కొన్ని మందులు వాడి చూశాడు. అవేమీ ఏమాత్రం పని చేయలేదు. ఇక లాభం లేదనుకుని మధురైనుంచి పెద్దవైద్యులకోసం కబురు పంపాడు. వెంకటశాస్త్రిపై ఉన్న అభిమానంతో వారు ఈ ఊరు వచ్చి పరీక్షించి మందులు ఇచ్చారు. అయినప్పటికి లాభం లేకపోయింది. ఇదంతా తన పూర్వజన్మ కర్మఫలం అని వెంకటశాస్త్రి బాధపడసాగాడు.

ఇలా ఉండగా ఒకనాడు ఆ ఊరికి ఆంధ్రదేశం నుండి ఒక గొప్ప జ్యోతిష్యుడు వచ్చాడు. అతడు జ్యోతిష్యంతో ఎంతో ప్రావీణ్యత కలవాడని ఎటువంటి సమస్యలకైనా



పరిష్కారం చూపగలడని జనం చెప్పుకున్నారు. ఒకనాడు ఆ జ్యోతిష్కుడు వెంకటశాస్త్రి ఇంటికి వచ్చాడు. అతడి జాతకం చూసి కనులు మూసుకుని ధ్యానించి ఇలా అన్నాడు. స్వామీ మీరు కిందటి జన్మలో ఘోరాతిఘోరం చేశారు. అకారణంగా పది సర్పాలను చంపారు. మీకు ఏ హానీ తలబెట్టకపోయినప్పటికి వాటిని క్రూరంగా హింసించి చంపారు. ఆ పాపఫలం మీరు ఈ విధంగా అనుభవిస్తున్నారు. దీనికి ఒక్కటే పరిహారం. ఆ కార్తికేయుని వేడుకొనడమే. ఇక్కడకు కొద్దిదూరంలో తిరుప్పారకుంద్రం అనే శ్రీసుబ్రహ్మణ్యేశ్వరులవారి దివ్య క్షేత్రం ఉన్నది. అక్కడ వెలసిన షణ్ముఖుడు ఎంతో గొప్ప మహాత్యం కలవాడు. ఆ స్వామి తన బల్లెంతో అక్కడ ఒక సరస్సును సృష్టించాడు. తమరు వచ్చే మంగళవారం ఆ క్షేత్రానికి వెళ్లి స్వామిని ఆరాధించి ఆ సరస్సులో స్నానమాచరించండి. నీ పూర్వజన్మ పాపం నశించి మీకు పూర్తిగా ఆరోగ్యం కలుగుతుంది అని చెప్పాడు.

వెంకటశాస్త్రి ఆ తరువాత వచ్చిన సోమవారం బయలుదేరి రాత్రికి తిరుప్పారకుంద్రం చేరాడు. ఉదయం లేచి శుచిగా స్నానం చేసి ఆలయంలో స్వామిని దర్శించాడు. అటుపిమ్మట పక్కనే ఉన్న సరస్సు వద్దకు వచ్చి ఆ నీటిలో దిగి రెండు చేతులతో ఆ కార్తికేయుని నమస్కరిస్తూ నీటిలో మూడు సార్లు మునిగాడు. అంతే ఆశ్చర్యం. వెంకటశాస్త్రి చర్మవ్యాధి క్షణంలో మాయమైంది. ఆనందంతో వెంకటశాస్త్రి కళ్ళనీళ్ళు వచ్చాయి. ఆలయం వైపు తిరిగి ఆ స్వామిని ప్రార్థిస్తూ ఇలా అన్నాడు. స్వామీ కార్తికేయ! నీవు జ్ఞానసంపన్నుడవు. నిన్ను కొలచినవారిని నిత్యం రక్షించే అమృతమూర్తివి. శ్రీ వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరా నీకివే నా నమస్కారములు. నిన్ను స్మరించేవారికి ఎన్నో జన్మలపాపాలు నశించి కైవల్యం లభిస్తుంది. నిత్యం నిన్ను స్మరించేవారికి సర్వ సౌభాగ్యాలూ కలుగుతాయి అని ఆ స్వామిని ఎన్నోవిధాల కొనియాడాడు. ఆలయంలోనికి వెళ్ళి స్వామిని దర్శించాడు. తిరిగి తన ఊరు ప్రయాణం అయ్యాడు. జీవించినంత కాలం ఆ స్వామినే సేవిస్తూ సుఖంగా జీవించి చివరన ముక్తిని పొందాడు.

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుని అర్చించటం వలన కుజదోషం నుంచి విముక్తులవుతారు. ఎటువంటి సర్పదోషాలు ఉన్నా తొలగిపోతాయి. బుద్ధి వికసిస్తుంది. విద్యార్థులకు పరీక్షలలో జయం కలుగుతుంది. మంగళవారంనాడు షణ్ముఖుని పూజించినవారికి చక్కటి సంతానం కలుగుతుంది. నిత్యమూ ఆ స్వామిని తలచేవారికి సర్వసౌభాగ్యాలూ కలుగుతాయి.

సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం షణ్ముఖనాథం సుబ్రహ్మణ్యం
సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం శంకరపుత్రం సుబ్రహ్మణ్యం

# శ్రీ సుబ్రహ్మణ్య వ్రతం

## అయిదవ అధ్యాయం

## మణిశర్మ దివ్య కథ

పూర్వకాలంలో తమిళదేశంలో మణిశర్మ అనే చర్మకారుడు ఉండేవాడు. అతను వంశపారంపర్యంగా వచ్చిన చెప్పులు కుట్టే వృత్తిలో జీవిస్తూ ఎంతో భక్తిపరాయణుడై ఉండేవాడు. పరమేశ్వరుడన్నా, విఘ్నేశ్వరుడన్నా, సుబ్రహ్మణ్యేశ్వరుడన్నా అతనికి ఎంతో ప్రాణం. ప్రత్యేకించి బాలసుబ్రహ్మణ్యేశ్వరుడంటే మరీ ప్రాణం. ఎల్లప్పుడూ ఆ బాలసుబ్రహ్మణ్యాన్నే తలుస్తుండేవాడు. అతని భార్య వసుమతి కూడా ఎంతో భక్తితో ఉండేది. ఆ దంపతులిద్దరూ ఎంతో నిర్మలమనస్సుతో జీవిస్తుండేవారు.

మణిశర్మకు అన్నీ ఉన్నా సంతానం లేకపోవటం బాధగా ఉండేది. ప్రతిరోజు ఆ దంపతులు తమకు సంతానం అనుగ్రహింపవలసినదిగా అందరు దేవతలను ప్రార్థించేవారు. కానీ ఏ మాత్రం ఫలితం లేకపోయింది. రోజులిలా గడుస్తూ మణిశర్మకు నలభై సంవత్సరాల వయసు వచ్చింది. ఒకరోజు ఆ విషయమే ఆలోచిస్తూ తీవ్రమైన మనస్తాపానికి గురయ్యాడు. భార్యతో ఇలా అన్నాడు. ఇన్నేళ్ళుగా మనం ఇంతమంది దేవతలను ప్రార్థిస్తున్నాం. అయినా ఏమీ ఫలితం లేకపోయింది. రేపటినుంచి నేను వారంరోజులు పచ్చి మంచినీరు కూడా ముట్టకుండా ఉపవాస దీక్ష చేస్తాను. ఆ స్వామి కరుణిస్తే సరి లేకపోతే ప్రాణాలైనా వదులుతాను అని అన్నాడు. ఆ మాటలు విన్న భార్య వసుమతి కంట నీరు పెట్టింది. భార్యతో అన్నట్లుగానే మణిశర్మ మర్నాడు ఉదయంనుంచి ఏ ఆహారమూ తీసుకోవటం మానేశాడు. అలా మూడురోజులు అయ్యేసరికి ఓపిక తగ్గింది. నాలుగవ రోజు మంచం మీదనుంచి లేవలేకపోయాడు. బంధువులు, స్నేహితులు ఎంత



చెప్పినా వినలేదు. అయిదవ రోజు సాయంత్రం ఒక పిల్లవాడు ఎక్కడినుంచో పరిగెత్తుకుంటూ వచ్చి మామా ఈ అరటిపండు తిను, నీకేమీ పరవాలేదు అని అతనిచేతిలో ఒక అరటిపండు పెట్టాడు. ఆ బాలుడి తేజస్సుకు ఆశ్చర్యపోతూ మణిశర్మ ఒక్క క్షణం ఒళ్ళు మరచాడు. తనను ఏదో తెలియని మాయ కప్పేసింది. తన ఉపవాసం సంగతి కూడా గుర్తు రాలేదు. చక్కగా చిరునవ్వు నవ్వుతున్న ఆ బాలుని చూస్తూ అతడినుండి అరటిపండు తీసుకుని కనులకు అద్దుకుని తిన్నాడు. అంతే ఒళ్ళంతా ఏదో దివ్యమైన తేజస్సు ప్రసరించినట్లయింది. ఆ బాలుడు ఒక్క క్షణాన పరిగెత్తుకుంటూ బయటకు వెళ్లి మాయమయ్యాడు.

మణిశర్మకి ఒక్కసారిగా కునుకు పట్టింది. నిద్రలో ఆ కుమారస్వామి కలలో దర్శనమిచ్చి బాలుని రూపంలో వచ్చింది తానేనని త్వరలోనే వారికి చక్కటి పిల్లవాడు జన్మిస్తాడని చెప్పాడు. అక్కడికి కొంచెం దూరంలో వున్న పళముదిర్‌చోళై అనే పుణ్యక్షేత్రంలో తాను వెలిశానని ఏడు మంగళవారాలు తనను దర్శించమని అన్నాడు. నిద్రనుండి మెళకువ వచ్చిన మణిశర్మ తనకు వచ్చిన కల వివరంగా భార్యకు చెప్పాడు. ఆ దంపతుల ఆనందానికి అవధులు లేవు. సాక్షాత్తూ ఆ షణ్ముఖుడే వచ్చి దర్శనమిచ్చి తమకు కరుణించినందుకు ఎంతో సంతోషించారు.

ఆ దంపతులు ఇద్దరూ స్వామి శెలవిచ్చినట్లుగా ఏడు మంగళవారాలపాటు 'పళముదిర్‌చోళై' లో శ్రీ వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించారు. ఆ స్వామి అనుగ్రహంతో వారికి చక్కటి పిల్లవాడు జన్మించాడు. మణిశర్మ, వసుమతి దంపతులిద్దరూ బ్రతికినంతకాలం ఆ కార్తికేయుని సేవిస్తూ కలకాలం సుఖంగా జీవించారు.

సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం షణ్ముఖనాథం సుబ్రహ్మణ్యం

సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం శంకరపుత్రం సుబ్రహ్మణ్యం

# శ్రీ సుబ్రహ్మణ్య వ్రతం

## ఆరవ అధ్యాయం

## పెరియశెట్టి కథ

పూర్వకాలంలో తమిళనాడులోని కుంభకోణం పట్టణానికి కొద్దిదూరంలో ఒక చిన్న గ్రామంలో పెరియశెట్టి అనే వ్యాపారస్తుడుండేవాడు. అతడు ఎన్నో వ్యాపారాలు చేస్తూ ఎంతో సంపద ఆర్జించాడు. అంత సంపాదించినా పెరియశెట్టి ఏ మాత్రం దానధర్మాలు చేసేవాడు కాదు. అతడికి ఇద్దరుకుమార్తెలు. వందన, చందన. వందన వివాహం అయినప్పటికి చిన్నకుమార్తె చందన వివాహం ఏమాత్రం కుదరటం లేదు. ఎన్ని సంబంధాలు వచ్చినా చివరి క్షణంలో ఆగిపోతున్నాయి. ఇలా ఎందుకు జరుగుతుందో ఆ దంపతులకు అర్థం కాలేదు.

ఇలా ఉండగా ఆ సంవత్సరం విపరీతమైన కరువు పట్టుకుంది. వర్షాలు ఏ మాత్రం కురవలేదు. జనంలో ఏ వస్తువులూ కొనే స్థితిలేక పెరియశెట్టికి వ్యాపారంతో ఎంతో నష్టం వచ్చింది. నష్టానికి తోడు కూతురు పెళ్ళి జరగకపోవటంకూడా బాధ పట్టుకుంది. అప్పుడప్పుడు భార్యతో కలిసి దగ్గరలో ఉన్న స్వామిమలై దివ్యక్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుని కొలుస్తున్నాడు. అయినా ఫలితం లేకపోయింది. ఎంత ప్రయత్నించినా చిన్నకుమార్తెకు వివాహం కుదరటం లేదు.

ఇలా ఉండగా ఒకనాడు ఒకసాధువు వారింటికి వచ్చాడు. అతడు పెరియశెట్టితో వచ్చే మంగళవారం నాడు స్వామిమలైలో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకం చేయించమని చెప్పాడు. ఆమాట విన్న పెరియశెట్టి కొంచెం విసుగ్గా ఇలా అన్నాడు. స్వామీ వచ్చేవారం ఏమిటి? ఇంతకుముందు ఎన్నో మంగళవారాలు అక్కడ అభిషేకం చేయించాను. ఏమీ ఫలితం లేకపోయింది. మరోమారు చేయించినా ఏముంటుంది అని అన్నాడు. అప్పుడు ఆ సాధువు నాయనా సరే ఇన్నిసార్లు చేయించావు ఒక్కసారి మళ్ళీ చేయించు తప్పక ఫలితం ఉంటుంది అని అన్నాడు. అప్పుడు పెరియశెట్టి ఆ సాధువుతో ఆ అదేమంత కష్టం కాదు లెండి, మళ్ళీ అభిషేకం చేయిస్తాను అన్నాడు.

శని, ఆదివారాలు గడిచి సోమవారం వచ్చింది. పెరియశెట్టికి పక్కఊరి జమిందారునుంచి ఏదో ముఖ్యమైన పని ఉందంటూ కబురు రావటంతో వెళ్లాడు. అన్ని



వివరంగా మాట్లాడేటప్పటికి సాయంత్రం అయ్యింది. ఒక్కసారిగా వర్షం పట్టుకుంది. అంతటివానలో బయలుదేరటానికి కుదరక రాత్రి అక్కడే ఉండిపోవలసి వచ్చింది. వర్షం మరునాడు మధ్యాహ్నందాకా తగ్గలేదు. అక్కడితో ఆ సాధువు చెప్పినట్లు ఈ మంగళవారం స్వామిమలై వెళ్ళటం పెరియశెట్టికి కుదరలేదు. వచ్చేవారం వెళ్ళవచ్చునని అనుకున్నాడు.

ఆ వారం పూర్తయి తిరిగి సోమవారం వచ్చింది. భార్య ఈ సారి ఎలాగైనా స్వామిమలై వెళ్ళి అభిషేకం చేయించాలని అన్నది. ఉదయం ఇంకాసేపట్లో బయలు దేరుతారనగా పెరియశెట్టి ఒక్కసారిగా కాలుజారి పడ్డాడు. కాలు చాలా నొప్పి చేసింది. ఏమాత్రం కదలలేకపోతున్నాడు. అక్కడితో ఆ సుబ్రహ్మణ్యేశ్వరుని దర్శనానికి ఈ మంగళవారం కూడా వెళ్ళలేకపోయాడు. ఎందుకు ప్రతిసారి ఈవిధంగా అవాంతరం వస్తున్నదని భార్య ఎంతో బాధపడింది.

ఇంతలో వారం గడిచింది. మళ్ళీ సోమవారం వచ్చింది. ఇంకాసేపట్లో బయలు దేరుదామని తలుస్తుండగా భార్య కాలుమెలికపడింది. ఆ నొప్పి క్షణ క్షణానికి ఎక్కువై ఏమాత్రం కదలలేకపోయింది. ఇక ఈవారం కూడా వెళ్ళడానికి కుదరలేదు. ఇలా ఎందుకు జరుగుతుందో వారికి అర్థం కావడం లేదు. తాము ఏదో అపరాధం చేశామని తలచాడు. ఆరోజు రాత్రి సుబ్రహ్మణ్యేశ్వరుడు పెరియశెట్టి భార్యకి కలలో కనపడి ఇలా అన్నాడు. అమ్మా నీ భర్త నన్ను దర్శించటం ఎంతో తేలికని, అదేమంత కష్టమైనది కాదని అహంకారంతో అన్నాడు. ప్రతీ మంగళవారం వెళుతున్నాం కదా మరొక్కసారి వెళ్ళటం అదేమంత కష్టం కాదని అన్నాడు. నా అనుగ్రహం లేకపోతే ఎంత దగ్గరలో ఉన్నా నా దర్శనం ఎలా జరగదో తెలియకపరచటానికై ఇలా చేస్తున్నాను. ఈ సారి తప్పక నా దర్శనం లభిస్తుంది అని అన్నాడు.

భార్య నిద్రనుంచి లేవగానే తనకు వచ్చిన స్వప్నంగురించి పెరియశెట్టికి వివరంగా చెప్పింది. పెరియశెట్టి తన అహంకారానికి మన్నించమని ఆ స్వామికి నమస్కరించి చెంపలు వేసుకున్నాడు. ఇంకెప్పుడూ అలా మాట్లాడనని, తనను క్షమించమని వేడుకున్నాడు. భక్తవత్సలుడైన ఆ స్వామి అనుగ్రహంతో ఆ మరుసటి మంగళవారం ఆ కుటుంబానికి స్వామిమలైలో చక్కటి దర్శనం జరిగింది. వారు ఆ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఎంతో వైభవంగా అభిషేకం చేయించారు. ఇది జరిగిన కొద్దిరోజులకే నాగరాజు అనే వరునితో చందనకు వైభవంగా వివాహం జరిగింది. పెరియశెట్టి కుటుంబం అంతా ఆ స్వామిని సేవిస్తూ కలకాలం సుఖంగా జీవించారు.

సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం షణ్ముఖనాథం సుబ్రహ్మణ్యం
సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం శంకరపుత్రం సుబ్రహ్మణ్యం

శ్రీ సుబ్రహ్మణ్య వ్రతం సమాప్తం



స్కంధం షణ్ముఖం దేవం  శివతేజం ద్విషడ్భుజం

కుమారం స్వామినాథం  త్వం  కార్తికేయం నమామ్యహం



సుబ్రహ్మణ్య సుబ్రహ్మణ్య సుబ్రహ్మణ్య పాహిమాం
సుబ్రహ్మణ్య సుబ్రహ్మణ్య సుబ్రహ్మణ్య రక్షమాం